## క్లుప్తంగా

### మహేంద్రులు రాజకీయంగా ఎదగాలి

**దేవరకద్ర:** మహేంద్రులు రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర మేదరి సంఘం ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్ కోరారు. మంగళవారం ఆయన దేవరకద్రలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో వరంగల్‌లో జరిగిన అనుబంధ సంఘాల ప్రమాణా స్వీకారోత్సవ మహాసభలో పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

### నేడు స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్

**జడ్చర్ల టౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట ఆఫీస్ ఫంక్షన్‌హాల్లో బుధవారం స్ట్రీట్ ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించే ఫుడ్‌ఫెస్టివల్ కంసేల్‌లో మహిళా సమాఖ్య సభ్యులు తయారు చేసే తినుబండారాల ప్రదర్శనతో పాటు విక్రయానికి ఉంచుతారన్నారు. కార్యక్రమానికి పట్టణవాసులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### నేడు విద్యుత్ ఉద్యోగుల విధులు బహిష్కరణ

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను ఖండిస్తూ ఈనెల 9న జిల్లా వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు విధులు బహిష్కరించనున్నట్లు విద్యుత్‌ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ భవన్, జడ్చర్ల డివిజన్ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విద్యుత్ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

### నేడు రేషన్ డీలర్ల సమావేశం

**గండేడ్:** మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లికార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి అన్ని గ్రామాల డీలర్లు హాజరుకావాలని కోరారు.

### ట్రాక్టర్లు సీజ్, కేసు నమోదు

**రాజాపూర్:** ఎటువంటి అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని కడిగి కృత్రిమ ఇసుకను తయారు చేసి తరలిస్తున్న ఒక జేసీబీ రెండు ట్రాక్టర్లను మంగళవారం మండలంలోని రాయపల్లి శివారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రాజాపూర్ ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. కృత్రిమ ఇసుకను తయారు చేసి విక్రయిస్తున్న రాజు, వెంకటసాయి, శ్రీరామ్, శ్రీను అను వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

### వ్యక్తులపై కేసు నమోదు

**మహమ్మదాబాద్:** మండలంలోని కంచన్‌పల్లికి చెందిన బాల్‌రాజు అన్నారెడ్డిపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను మంగళవారం అర్ధరాత్రి జూలపల్లికి తరలిస్తుండగా పట్టుబడ్డాడు. హన్వాడ మండలం కిష్టంపల్లికి చెందిన రాములు కిష్టంపల్లి వాగు నుంచి జూలపల్లికి మంగళవారం అర్ధరాత్రి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డాడు. ఈ మేరకు ఇద్దరి ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

### అధ్యాపకుడికి డాక్టరేట్



**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్రం అధ్యాపకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నాగరాజుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ను ప్రకటించింది. ఈమేరకు ఓయూ ప్రొఫెసర్ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో 'లోకల్ ఆఫ్ కంట్రోల్‌పై పొదుపు మరియు పెట్టుబడి అలవాట్లపై ప్రభావం, మహబూబ్‌నగర్ జిల్లా ఉపాధ్యాయులపై ప్రత్యేక పరిశీలన' అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను ఆయనకు డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

**నవాబుపేట:** మండలంలోని రుద్రారం ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఎంఈఓ నాగ్యనాయక్ ప్రారంభించారు. పాఠశాలకు దాతల సహకారంతో కంప్యూటర్ సెట్‌తో పాటు ఎంఆర్‌సీ నుంచి ఒక కంప్యూటర్ సెట్‌ను అందించి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు.

### ఈకేవైసీ నమోదు చేయించాలి

**నవాబుపేట/మిడ్జిల్:** రేషన్ దుఖాణాల్లో లబ్ధిదారులతో ఈ కేవైసీ విధిగా చేయించాలని తహసీల్దార్లు శ్రీనివాస్, యూపీ రాజు సూచించారు. మంగళవారం వారు డీలర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడు ఈకేవైసీ చేయించాలన్నారు.

### వైశ్య రణభేరీ పోస్టర్ ఆవిష్కరణ



**జడ్చర్ల టౌన్:** హైదరాబాద్‌లో ఆగస్టు 3న నిర్వహించే వైశ్య రణభేరీ వాల్‌పోస్టర్‌ను వైశ్య వికాసవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పాలాది రాంమోహన్‌లు ఆవిష్కరించారు. పట్టణంలోని వాసవికన్యాకాపరమేశ్వరి ఆలయంలో వారు ప్రసంగించారు.

# జనహృదయ నేతకు ఘన నివాళి

- మండల కేంద్రాలు, గ్రామాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు
- విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలతో నివాళులు
- జడ్చర్లలో పాల్గొన్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**స్టేషన్ మహబూబ్‌నగర్/జడ్చర్ల టౌన్:** ప్రజాప్రయోజన పథకాలతో ప్రజల హృదయాల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి పురస్కరించుకుని నియోజకవర్గ కేంద్రం వైఎస్‌ఆర్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన హయాంలో అమలు చేసిన పథకాలు కోట్లాదిమందికి మేలు చేశాయని, ప్రతి నాయకుడు వైఎస్సార్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

- దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్‌ఆర్ జయంతి సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఉన్నత వర్గాలకు పరిమితమైన ఇంజినీరింగ్, మెడికల్ లాంటి కోర్సులను నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులు చెల్లించి ఎందరినో ఇంజినీర్లుగా, డాక్టర్లుగా తీర్చిదిద్దిన ఘనత వైఎస్‌ఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, అజ్మత్‌అలీ, అవేజ్ అహ్మద్, కంచిమి లక్ష్మణ్, గులాం జహీర్, పీర్ సాధిక్, బాలస్వామి, అంతయ్య, నిత్యానందం, రేణుక, బుక్క వెంకటేశం, అశోక్‌యాదవ్, కుమ్మరి రాజు, అరవిందమ్మ, అల్వాల్‌రెడ్డి, లక్ష్మమ్మ, మాలిక్‌షాకీర్, గంగ్యానాయక్, బుర్ల వెంకటయ్య, సుధాకర్‌రెడ్డి, మినాజ్, ఎర్ర ఆనంద్ పాల్గొన్నారు.
- చిన్నచింతకుంట మండల కేంద్రంలో మాజీ సీఎం వైఎస్సార్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పులకేష్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ వెంకటేష్, మహిమూద్, సద్దాం, పంతులు మహేష్, ఎండీ రహిమత్, శివ, రవి, ఆసిఫ్, నయీం పాల్గొన్నారు.
- దేవరకద్ర నియోజవర్గ కేంద్రంలో పాత బస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహానికి మండల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, కోనరాజశేఖర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఫారూఖ్, రాంపాండు, శ్రీనివాస్‌రెడ్డి, వర్మ, జగన్నాథ్ రెడ్డి, చంద్రమౌళి, నర్సింహారెడ్డి, జైపాల్‌రెడ్డి, అమరేశ్వర్‌రెడ్డి, రాము, విక్రమ్, బుచ్చన్న పాల్గొన్నారు.




మహబూబ్‌నగర్‌లో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



దేవరకద్రలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష

**దేవరకద్ర:** నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా జరిగిన సమీక్షలో ఒక్కో గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులను పిలిచి సమస్యలపై చర్చించారు. కొన్ని సమస్యలను అధికారుల సమక్షంలోనే పరిష్కరించి, మిగతా వాటిని నోట్ చేసుకున్నారు. మండలంలోని 24 గ్రామాల సంబంధించి ఒక్కో గ్రామంపై జరిగిన సమీక్ష ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది.

**మున్సిపాలిటీ అభివృద్ధిపై సమీక్ష**

దేవరకద్ర మున్సిపాలిటీలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్షించారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో చేపట్టే పనులపై ఆరా తీశారు. మున్సిపాలిటీ పరిధిలోని చౌదర్‌పల్లి, మీనగోనిపల్లి, గోప్లాపూర్, బల్సుపల్లి గ్రామాలకు సంబంధించి సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంఈఓ బలరాం, ఏఓ రా జేందర్ అగర్వాల్, ప్రత్యేక అధికారి రాజమణి, డీఈ చందు, ఏఈ కీర్తి, ఏపీఎం రామన్న, ఎస్‌ఐ నాగన్న, కార్యదర్శులు ఉన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి



**అడ్డాకుల:** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా సహకార అధికారి శంకరాచారి అన్నారు. మూసాపేట మండలం పోల్కంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 'అమ్మ పేరు మీద ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా వనమహోత్సవంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఆరోగ్యకరమైన జీవితం గడపాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే భావి తరాలకు భవిష్యత్ ఉంటుందన్నారు. రైతులు, చిరు వ్యాపారులు ఆర్థికంగా ఎదగడానికి సహకార సంఘాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సొసైటీల నుంచి రుణాలు పొందిన వారు వాటిని సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ, ఆడిట్ ఆఫీసర్ టైటస్‌పాల్, విండో అధ్యక్షుడు బండ వెంకటేశ్వర్‌రెడ్డి, మానిటరింగ్ ఆఫీసర్ కల్పన, రాజశేఖర్, బాశన్న, సాదత్ అలీ, నాగరాజు, వైస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, సీఈఓ భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న నర్సింహులు

**మిడ్జిల్:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీఆర్‌డీఓ నర్సింహులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ఇందిర మహిళా శక్తి సంబరాలలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులుగా చేయుటకు, అన్ని రంగాల్లో ప్రోత్సహించుటకు స్వయం సహాయ సంఘాల మహిళలతో పాఠశాల యూనిఫాంలు కుట్టించి ఎంతో లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పెట్రోలు బంకులు, ఇందిర మహిళా శక్తి బజారు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, ఇందిర మహిళా శక్తి క్యాంటీనుల నిర్వహణ ఏర్పాటు చేస్తోందన్నారు. ఆసక్తి గల మహిళలు తమ జీవనోపాధి కోసం ఆవసరమైన వాటికి దరఖాస్తు చేసుకోని లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఏపీఎం శారద, భాగ్య, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసిన ఘనత జీఎంఆర్‌దే



అడ్డాకులలో మాట్లాడుతున్న కారెడ్డి నాగిరెడ్డి

**అడ్డాకుల:** బీఆర్‌ఎస్ హయాంలో 10 ఏళ్లలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే దేవరకద్ర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిన ఘనత ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి(జీఎంఆర్)కే దక్కుతుందని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సొంత ఆస్తులు కూడబెట్టుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు తోట శ్రీహరి, జగదీశ్వర్, విజయ మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శకుంతల, సంతోషి, తదితరులు ఉన్నారు.

**ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికావు**

**చిన్నచింతకుంట:** ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరైనవి కావని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మాజీ జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు.

**గఫ్లత్ పార్టీ కాంగ్రెస్ కాదు బీఆర్‌ఎస్**

**భూత్పూర్:** అధికారం కోల్పోయి ఆవేశంతో, సంస్కార హీనంగా మాట్లాడటం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి తగదని, ప్రజల్లో కోల్పోయిన విశ్వాసాన్ని మళ్లీ తెచ్చుకుందామనే భావనతో కాంగ్రెస్ పార్టీని గఫ్లత్ పార్టీ అని మాట్లాడడం సరికాదని, బీఆర్‌ఎస్ పార్టీ గఫ్లత్ పార్టీ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టౌన్ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?**

భూత్పూర్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ హయాంలో అభివృద్ధి జరిగిందా, బీఆర్‌ఎస్ పార్టీ హయాంలో అభివృద్ధి జరిగిందా? అనే దానిమీద చర్చల ద్వారా నిరూపించడానికి మేము సిద్ధమని, మీరు సిద్ధమా? అని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్ సవాల్ విసిరాడు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నర్సింహులు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి, హర్యానాయక్, సంజీవరెడ్డి, తమ్మన్న గౌడ్, బాలవర్ధన్‌రెడ్డి, నరేందర్, తిరుపతయ్య, టి.వెంకటేశ్వర్‌రెడ్డి, కిట్టురెడ్డి పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లేదు**

**దేవరకద్ర:** దేవరకద్ర ఎమ్మెల్యేను విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి లేదని కొకుంట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘువేందర్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్‌రెడ్డిలు అన్నారు. కొకుంట్ల మండల కేంద్రంలో విలేకరులతో వారు మాట్లాడారు.

## ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయాలి



**చిన్నచింతకుంట:** ఓటరు జాబితాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి పేరు నమోదు చేయాలని రెవెన్యూ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు నిర్వహించిన జాతీయ ఓటర్ల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్లయ్య, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌ఐ తిరుపతయ్య, బీఎల్‌ఓలు ఉన్నారు.


## ఏటీఎం ఏమార్చిన అపరిచిత వ్యక్తి

**మహబూబ్‌నగర్ క్రైం:** డబ్బులు డ్రా చేయడానికి వెళ్లిన ఓ అమ్మాయి దగ్గర అపరిచిత వ్యక్తి ఏటీఎం కాజేసి, ఏటీఎంలో నుంచి నగదు డ్రా చేసుకోవడానికి విఫలయత్నం చేశాడు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని క్రిస్టియన్‌పల్లిలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో మంగళవారం డబ్బు డ్రా చేసుకోవడానికి వెళ్లిన ఓ అమ్మాయికి డబ్బులు తీసి ఇస్తానని ఏటీఎం కార్డును ఓ గుర్తు తెలియని వ్యక్తి తీసుకున్నాడు. ఆ వెంటనే డబ్బులు డ్రా చేసి ఇచ్చిన తర్వాత అతని దగ్గర ఉన్న మరో ఏటీఎం కార్డు ఆ యువతికి ఇచ్చాడు. కొంత సమయం తర్వాత చూసుకున్న యువతి ఏటీఎం కార్డు మారినట్లు గుర్తించి వెంటనే బ్యాంకు దగ్గరకు వెళ్లి ఏటీఎం కార్డును బ్లాక్ చేయించింది. ఈ సమయంలో సదరు వ్యక్తి పలు ఏటీఎంల దగ్గరకు వెళ్లి డబ్బులు డ్రా చేయడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని రూరల్ ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

## ఇంటర్‌లో అడ్మిషన్లు పెంచాలి

**మిడ్జిల్:** ప్రభుత్వ కళాశాలలో ఇంటర్‌లో అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని ఇంటర్ బోర్డు డిప్యూటీ కార్యదర్శి విశ్వేశ్వర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా అధ్యాపకులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య ఉన్నారు.

# ఆదర్శ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** జిల్లా కేంద్రంలోని ఆదర్శ పీజీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈమేరకు ముతూత్ మనీ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌కు ఉమ్మడి జిల్లాలో వివిధ కళాశాలలకు చెందిన ఎంబీఏ, ఎంకాం అభ్యర్థులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూ, పరీక్షల అనంతరం మొత్తం 14 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక కాగా, వారికి ముతూత్ కంపెనీ వారు నియామకపత్రాలు అందజేశారు. ఈ మేరకు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఆదర్శ కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ అనిల్‌కుమార్, కార్యదర్శి రాములు, కోశాధికారి అరుణ్‌కుమార్, రాక్నీజాయిస్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఆయిల్‌పాం సాగుపై మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి స్వప్న

**మహబూబ్‌నగర్ (వ్యవసాయం):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోడూర్ గ్రామ రైతువేదికలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి ఇ.స్వప్న మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా మూడు రెట్లు అధిక దిగుబడి, లాభాలను వచ్చే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఎకరానికి 57 మొక్కలు నాటవచ్చని, నాలుగో ఏట నుంచి 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఎకరానికి కనిష్టంగా 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని, దీంతో రూ.1.20 లక్షల నుంచి రూ. 1.50 లక్షల వరకు ఆదాయం సమకూరుతుందన్నారు. మిగతా పంటలతో పోల్చితే ప్రకృతి వైపరీత్యాల నుంచి తట్టుకోవడమే గాక చీడపీడల బెడద ఉండదన్నారు. మూడో ఏట నుంచి ఆయిల్‌పామ్‌లో అంతర్ పంటలు సాగు చేయవచ్చన్నారు. వంద శాతం రాయితీతో మొక్కలు పొందడమే గాక డ్రిప్ పరికరాలను కూడా సబ్సిడీపై ఇస్తామని తెలిపారు. మొక్కల పెంపకానికి ఏటా ఎకరానికి రూ.4,200 చొప్పున నగదు బదిలీ ద్వారా నేరుగా రైతు ఖాతా లో జమ చేస్తామన్నారు. ఈ సదస్సులో మండల వ్యవసాయ అధికారి శృతి, ఏఈఓలు నాగార్జున, జీపీ శివాని, పంచాయతీ కార్యదర్శి సునీత, తదితరులు పాల్గొన్నారు.

**హన్వాడ:** రైతులు ఆయిల్‌పాం పంటల సాగుపై దృష్టిసారించాలని మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ సూచించారు. ఆయన మండలంలోని టంకర, హన్వాడ, తది తర గ్రామాల్లోని రైతు వేదికల్లో ఆయిల్‌పాం పంటల సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్య క్రమంలో హార్టికల్చర్ అధికారి శేఖర్, ఏఈఓ నాగప్ప, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం



సమ్మె కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

**మహబూబ్‌నగర్ రూరల్:** ఈనెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మనికొండ, మాచన్‌పల్లి, పోతన్‌పల్లి, కోటకదిర గ్రామాలలో సమ్మె సన్నాహక సమావేశాలు నిర్వహించారు.

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** దేశ వ్యాప్తంగా నేడు జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో నాయకులు హన్మంతు, సూరారం రాజు, కృష్ణయ్య, బాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**జడ్చర్ల టౌన్:** దేశ వ్యాప్తంగా బుధవారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన ఐకేపీ వీఓఏల సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వెంకటేష్, రవికుమార్, ఉమాదేవి, జయంతి, శంకర్‌నాయక్, రాములు, వేణుగోపాల్, కృష్ణయ్య ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

**దేవరకద్ర:** సార్వత్రిక సమ్మెను దేవరకద్ర నియోజకవర్గంలో విజయంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు దేవదానం పిలుపు నిచ్చారు. దేవరకద్ర మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు మాట్లాడారు. పెయింటర్ల సంఘం సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.

**మిడ్జిల్:** దేశ వ్యాప్తంగా 9న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ కోరారు. మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు వైద్యాధికారులకు సమ్మె నోటీసును అందజేశారు. చంద్రకళ,లక్ష్మి, విజయలక్ష్మి, శోభరాణి పాల్గొన్నారు.

# మహిళలు అభివృద్ధిలోకి రావాలి



మాట్లాడుతున్న డీపీఎం రామ్మూర్తి

**నవాబుపేట:** మహిళలు మరింత అభివృద్ధిలోకి రావాలని డీపీఎం రామ్మూర్తి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిగా మహిళా సంఘాలు చేపట్టిన కార్యక్రమాలు వాటి అభివృద్ధిపై ఆయన ప్రసంగించారు. మహిళలకు తాజాగా ఉన్న ప్రజాప్రభుత్వం వివిధ రకాల అవకాశాలు కల్పిస్తోందని, వాటిని వినియోగించుకోవాలన్నారు. ఆర్టీసీ బస్సులకు సైతం మహిళలు యజమానులను చేసిందని ఆయన వివరించారు. తాజాగా కిషోర బాలికలకు, 60 సంవత్సరాలు దాటిన మహిళలకు ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం జీవరత్నం, సీసీలు కాంచన, రమాదేవి, ఎంఎంఎస్ నాకురాల్లు అనిత, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన విద్య



ఏఐల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ కురుమూర్తి

**అడ్డాకుల:** ఏఐ కృత్రిమ మేధ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని మండల విద్యాధికారి కురుమూర్తి అన్నారు. మండలంలోని పొన్నకల్ ప్రాథమిక పాఠశాలలో రెండు కంప్యూటర్లతో ఏఐ ద్వారా ఏర్పాటు చేసిన విద్యా బోధనను మంగళవారం ఆయన ప్రారంభించారు. పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల కృషితో జిల్లాలోనే అత్యధిక అడ్మిషన్లు పొందిన పాఠశాలగా గుర్తింపు లభించిందని తెలిపారు. పాఠశాలకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఏఐ బోధన కోసం మరికొన్ని కంప్యూటర్లను పాఠశాలకు కేటాయించాలని ఎంఈఓను కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.వెంకటేష్, జాకీర్‌పాష, దొరబాబు, రవినాయక్, ఆసిఫ్‌ఖాన్, స్వాతి, గ్రామస్తులు ఉన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



ప్రొసీడింగ్ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**మహబూబ్‌నగర్ రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ నాయకుడు ఎల్లంగారి భరత్‌కుమార్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 23వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి ప్రొసీడింగ్ అందజేశారు. కార్యక్రమంలో హౌజింగ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు కుర్వ నరేష్, ముత్రం, రవి పాల్గొన్నారు.

**అడ్డాకుల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సంఖ్యను పెంచుతూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లె మాణిక్య రాజు, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునగలశెట్టి బాలరాజు, మనోహర్, నాగవర్ధన్, శ్రీకాంత్ ఉన్నారు.

# దేశ సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత




జాతీయ విద్యార్థి దినోత్సవంలో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** దేశసేవ చేయడం ప్రతి ఒక్క విద్యార్థి బాధ్యత అని ప్రాంత సహ సంఘటన్ కార్యదర్శి విష్ణువర్ధన్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏబీవీపీ ఢిల్లీ యూనివర్సిటీలో ప్రారంభమై నేడు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏర్పడడం గొప్ప విషయమని, విద్యార్థుల సమస్యల కోసం పోరాటం చేస్తూ, అనేక సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిందన్నారు. ఏబీవీపీ తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలకంగా వ్యవహరించిందని, అందులో భాగంగా పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 20వేల మంది విద్యార్థులతో రక్తదానం చేయించామన్నారు. కార్యక్రమంలో నాయకులు నవేంద్ర, నరేష్‌తేజ, సౌమ్య, సతీష్, శివసాగర్, శివ, సాయి, శ్రావణి, శివాని పాల్గొన్నారు.